ఇంటర్ ఫలితాల్లో బాలికల ప్రభంజనం

- ద్వితీయ సంవత్సరంలో 65.57శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లాకు 15వ స్థానం
- ప్రథమ సంవత్సరంలో 55.29 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లాకు 18వ స్థానం
- 23.81 శాతం అధిక ఉత్తీర్ణత సాధించిన బాలికలు

ప్రియాంక, ఎంపీసీ 978/1000

జి.భార్గవి, బైపీసీ 978/1000

సానియా, ఎంఈసీ 973/1000

వై.నిఖిత, సీఈసీ 964/1000

ప్రియాసింగ్, ఎంపీసీ, 457/470

అయేషా సిద్ధిఖీ, బైపీసీ, 432/440

బొల్లారం ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

బొల్లారం, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో.. పి.ప్రియాంక (978/1000), ఆర్.సాయి కుమార్ (973/ 1000), కాసిం కాసు (969/1000), బైపీసీ విభాగంలో.. జి.భార్గవి(978/1000), సం జన ప్రజాపతి (950/1000), అభిలాష (917/1000), ఎంఈసీలో.. సానియా (973/1000), చాందిని ఖాన్ (970/ 1000), బిందియా కుమారి (917/1000), సీఈసీ వై.నిఖిత (964/1000), కృష్ణ మనోహర్ (936/ 1000), డి.మౌనిక (935/1000) సాధించారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో..

ఎంపీసీ విభాగంలో ప్రియాంక సింగ్ (457/470), ఎస్.సందీప్(451/470), కె.జోష్ణ (422/470), బైపీసీ విభాగంలో ఆయేషా సిద్ధికి (432/440), సీ.రాజానందిని(431/440), సీహెచ్.భవిత (422/440), ఎంఈసీ విభాగంలో.. సప్రీన్ (474 /500), సుమన్ కుమారి (463/500), కే.ప్రసన్న(439/500), సీఈసీ విభాగంలో సభా బేగం (453/500), షేక్ షంషేర్ అలీ (407/500) సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఫస్ట్ ఇయర్‌లో..

జనరల్ కేటగిరీలో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థుల ఫలితాలు ఈవిధంగా ఉన్నాయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో భాగంగా మొత్తం 15,989 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 8,840 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 65.47 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలికలు బాలుర కంటే 23.81 శాతం అధిక ఉత్తీర్ణతతో పైచేయిగా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో భాగంగా మొత్తం 15,273 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 10,014 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 65.57 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

వొకేషనల్ కేటగిరీలో..

మొదటి సంవత్సరం వొకేషనల్ ఫలితాలకు సంబంధించి మొత్తం 1,681 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 912 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 695 మంది పరీక్ష రాయగా, 269 మంది ఉత్తీర్ణత సాధించారు. 38.71 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 986 మంది పరీక్షలకు హాజరు కాగా, 643 మంది ఉత్తీర్ణులయ్యారు. 65.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం వొకేషనల్ ఫలితాల్లో బాలికలు బాలుర కంటే 26.5 శాతం ఫలితాలు సాధించారు.

వొకేషనల్ ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి మొత్తం 1,321 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 887 మంది ఉత్తీర్ణులయ్యారు. 67.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 496 మంది పరీక్ష రాయగా, 257 మంది ఉత్తీర్ణత సాధించారు. 51.81 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 825 మంది పరీక్షలకు హాజరు కాగా, 630 మంది ఉత్తీర్ణులయ్యారు. 76.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలికలు బాలుర కంటే 25 శాతం అధిక ఉత్తీర్ణతతో పైచేయిగా నిలిచారు. ఈ విద్యా సంవత్సరంలో 67.15 శాతం ఫలితాలతో జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది.

రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్

బైజ సబా, స్టేట్ ఫస్ట్ ర్యాంక్

నారాయణఖేడ్, ఏప్రిల్ 24: నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బీపీసీ ఫస్టియర్ విద్యార్థిని బైజ సబా 437/440 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించింది. కేతావత్ అక్షయ రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్, సాయివాణి నాలుగో ర్యాంక్, వడ్ల స్నేహ రాష్ట్రస్థాయి 11వ ర్యాంక్ సాధించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు బెల్లాపురం పూజ, సపురా ఫాతిమా, విష్ణోశ్‌గౌడ్, నిఖిత అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.

కాలేజీ టాపర్‌గా నికిత

నికిత

నాగిల్‌గిద్ద, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో నారాయణఖేడ్ నియోజకవర్గం మెర్గి మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థిని వి.నికిత బైపీసీలో 1000కి 979 మార్కులు సాధించి సత్తా చాటి కాలేజీ టాపర్‌గా నిలిచింది. అధ్యాపకులు నికితను అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో భిన్న ఫలితాలు

జి.వర్ధిని

రామచంద్రాపురం, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల టీఎస్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం బీపీసీలో ఎం.హరిక 96.1శాతం, ఎంపీసీలో డి.ఐశ్వర్య 93.8శాతం, ఎంఈసీలో నికిల్‌గిరి 94.2శాతం, సీఈసీలో పి.సాయిదీప్తి 92.4శాతం మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బీపీసీలో జి.వర్ధిని 97.8శాతం, ఎంపీసీలో సి.సత్యనివేదిత 97.7శాతం, ఎంఈసీలో ఎం.కావ్య 92శాతం, సీఈసీలో వి.సౌమ్య 91శాతం మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ఆర్సీపురంలోని గీతాభూపాల్ రెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో గుడియసెట్ట 98.51శాతం, బీపీసీలో పి.సృజన 94.77శాతం, హెచ్ఈసీలో జే.ప్రవంతి 92.6శాతం, ద్వితీయ సంవత్సరం సీఈసీలో జి.చంద్రకళ 94.8శాతం, ఎంపీసీలో ఎస్.విజయ 94.3శాతం, హెచ్ఈసీలో అన్నుకుమారి 92.7శాతం మార్కులు సాధించి కాలేజీ టాపర్స్‌గా నిలిచారు.

కల్హేర్‌లో..

కల్హేర్, ఏప్రిల్ 24: కల్హేర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫస్ట్ ఇయర్‌లో 19 శాతం, సెకండ్ ఇయర్‌లో 34 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫరుక్ బహ్మాడి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో 89 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 17 మంది ఉత్తీర్ణులు కాగా, రెండో సంవత్సరంలో 108 మంది పరీక్ష రాయగా 34 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

జిన్నారంలో..

జిన్నారం, ఏప్రిల్ 24: జిన్నారం గురుకుల కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. 784 మార్కులతో బైపీసీకి చెందిన జాదవ్ వినోద్ టాపర్‌గా నిలిచారు. సంజీవ్ ఎంపీసీలో 745 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. కస్తూర్బా కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఎంపీసీలో 60 శాతం, బైపీసీలో 96 శాతం, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 50 శాతం, బైపీసీలో 73 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎస్‌వో కవిత తెలిపారు.

హత్నూరలో..

హత్నూర, ఏప్రిల్ 24: హత్నూర గురుకుల కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరంలో 84 శాతం, రెండో సంవత్సరంలో 84 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 11శాతం, రెండో సంవత్సరంలో 25శాతం, ఆదర్శ పాఠశాల, కళాశాలలో 22 శాతం, రెండో సంవత్సరంలో 45 శాతం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 31శాతం, రెండో సంవత్సరంలో 59శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

మెరిసిన గురుకుల బాలికలు

అలవేణి

భాగ్యలక్ష్మి

దేవిశ్రీ

నిత్యస్వారూపిణి

కోహీర్, ఏప్రిల్ 24: హోతి(కే) గురుకుల కళాశాలకు చెందిన బాలికలు సత్తా చాటారు. ఇంటర్ ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని అలవేణి 986 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 10వ స్థానంలో నిలిచింది. బైపీసీలో 985మార్కులు పొందిన భాగ్యలక్ష్మి రాష్ట్రంలో పదకొండో స్థానంలో నిలిచింది. ఎంపీసీలో వైష్ణవి 981మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో నిత్యస్వరూపిణి 435మార్కులు సాధించి తెలంగాణలో నాలుగో స్థానంలో నిలిచింది. వైషాలి 435మార్కులు, సాయి భవాని 435 మార్కులు, శివాని 433 మార్కులు పొందారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 470మార్కులకు దేవిశ్రీ 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. అర్చన 464, మౌనిక 462, ఉమారాణి 461, హరిప్రియ 461 మార్కులను సాధించింది. తమ గురుకుల కళాశాల నుంచి ఎంపీసీ 92శాతం, బైపీసీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, లెక్చరర్లు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు.

మే 2లోగా రీకౌంటింగ్‌కు అవకాశం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎలాంటి సందేహాలు ఉన్నా మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 24 నుంచి మే 2వ తేదీలోగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రీకౌంటింగ్ కోసం ఆన్‌లైన్ ద్వారా ఒక్కో పేపర్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, రీవెరిఫికేషన్, ఆన్సర్ బుక్‌లెట్ కోసం రూ.600 ఒక్కో పేపర్‌కు చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు తిరిగి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు విడతలుగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్టు కమిషనర్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 24 నుంచి మే 2వ తేదీలోగా పరీక్ష రుసుమును సంబంధిత కళాశాలలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థి ఆత్మహత్య

రామచంద్రాపురం, ఏప్రిల్ 24: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్లూర్‌లో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలివి. రామచంద్రాపురం మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన కె.అశోక్‌గౌడ్ కుమారుడు సాయితేజ గౌడ్(17) ఇంటర్మీడియట్ రెండో ఏడాది విద్యార్థి. ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. ఇంటర్నెట్‌లో రిజల్ట్ చూసుకొని తన నంబర్ లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. కుటుంబ సభ్యులు ఏమన్న అంటారని భయపడ్డాడు. ఆత్మహత్య చేసుకునేందుకు కొల్లూరు పెద్ద చెరువు వద్దకు చేరుకొని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయితేజ చిన్నాన్న, కౌన్సిలర్ రాజుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

కోహీర్, ఏప్రిల్ 24: కోహీర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బోరబండకు చెందిన షేక్ అన్వర్ అలీ(30)ని మంగళవారం కత్తులతో దాడి చేసి హత్య చేసిన ఘటనలో గురుజువాడ గ్రామానికి చెందిన మహ్మద్ కైఫ్, రాజనెల్లి గ్రామానికి చెందిన ముస్తకీమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని జహీరాబాద్ పట్టణ సీఐ రవి తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఎస్సై కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

జిన్నారం, ఏప్రిల్ 24: ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 181 జర్నలిస్టు కాలనీలో వరుస చిల్లర దొంగతనాలు బెంబేలెత్తిస్తున్నాయి. జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్నారు. కాగా తాళాలు వేసిన ఇండ్లను చిల్లర దొంగలు టార్గెట్ చేశారు. తాళాలు, తలుపులను బద్ధలుకొడుతూ లోపలికి వెళ్లి వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. బుధవారం ఒకేరోజు ఆరు ఇండ్ల తాళాలు పగులగొట్టడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు రాత్రి పూట నిఘాను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నిర్మాణరంగంపై అవగాహన

రామచంద్రాపురం, ఏప్రిల్ 24: భవిష్యత్తులో ఇంజినీర్స్‌గా ఎదిగే నేటి విద్యార్థులకు నిర్మాణ రంగంపై అవగాహన కల్పించామని హైహోమ్ జీఎం నాగరెడ్డయ్య అన్నారు. తెల్లాపూర్‌లోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మైహోం సంస్థ నేతృత్వంలో విద్యార్థులకు ఇంజినీర్స్ ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. విద్యార్థులకు నిర్మాణ రంగం ఆవశ్యకతను వివరించారు. ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్‌లో విజయవంతమైన కెరీర్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి, నిబద్ధతను ఉదహరిస్తుందని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న 35 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

హుస్సేల్లి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ భూపాల్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ భూపాల్ అన్నారు. బుధవారం మండలంలోని మెటల్‌కుంట, మామిడ్గి, హుస్సేల్లి, న్యాల్‌కల్, శంశోల్లాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలతోపాటు హుస్సేల్లి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, రన్నింగ్ వాటర్‌తోపాటు టాయిలెట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక నుంచి తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. మద్యం, నగదు, ఇతర వస్తువులు రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు మేడ్చల్ నుంచి బదిలీపై న్యాల్‌కల్ తహసీల్దార్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ భూపాల్‌కు డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గయ్య, సీనియర్ అసిస్టెంట్ శివకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. వీరభద్రేశ్వరుడి రథోత్సవం

వీరభద్రేశ్వర స్వామిరథోత్సవంలో భక్తులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 24: మండలంలోని మరియంపూర్ గ్రామంలో బుధవారం వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి జాతర ముగింపు సందర్భంగా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేదపండితులు ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. ఆనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తుల భజన కీర్తనాలు, భాజాభజంత్రీల మధ్య స్వామివారి రథోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆంతర్‌రాష్ట్ర కుస్తీపోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. నువ్వా.. నేనా అనే రీతిలో పోటీపడ్డారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన ఉద్గీర్‌కు చెందిన మల్లయోధుడు ప్రకాశ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ఐదు తులాల వెండి కడియాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్, చాల్కి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు అశోక్, జాతర కమిటీ సభ్యులు వీరన్న, నాగ్‌శెట్టి, కాశీనాథ్, గుండప్ప, సంజీవ్, బస్వరాజ్, కంటెప్ప, భీమన్న, రవిపాటిల్ పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ వార్షికోత్సవం

నారాయణరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ రేణుక

సంగారెడ్డి, ఏప్రిల్ 24: పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు వార్షికోత్సవం నిర్వహించడం గొప్ప విషయమని సీడీపీవో రేణుక అన్నారు. బుధవారం పట్టణంలోని నారాయణరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణరెడ్డి కాలనీతోపాటు సంజీవనగర్ కాలనీ, మార్క్స్‌నగర్, కలంవకుంట అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలను ఒకచోటుకు చేర్చి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటలు ఆడించారు. పాటలు పాడించారు. కథలను చిన్నారులతో చెప్పించి సంతోషించారు. ఈ వేడుకలకు సీడీపీవో హాజరై ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సూపర్‌వైజర్ జయలక్ష్మి, టీచర్ విజయ, అంజమ్మ, సక్కుబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో తారా విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి సాధించిన తారా కళాశాల విద్యార్థులు

జిజ్ఞాస పోటీల్లో ప్రథమ బహుమతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 24: రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో భాగంగా రసాయన శాస్త్ర విభాగంలో స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రియదర్శిని కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో కళాశాల విద్యార్థులు అభిషేక్, సుచరిత, శివకుమార్, అక్షయ, రాహుల్, ఉమా మహేశ్వరీ అవార్డు అందుకున్నారు. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ సెల్యూలోజ్ ఇన్స్పూస్డ్ యూరియా విత్ ఈస్ట్ అసిస్టెడ్ డైజెస్టిన్ మోడల్ ఫర్ ఎఫిసియంట్ క్రాప్ కల్టివేషన్' అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగధిపతి డాక్టర్ కె.అభిజిత్ ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనకు గాను ఈ అరుదైన అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అవార్డును సాధించిన విద్యార్థులు, అందుకు సహకరించిన అధ్యాపకుడిని అభినందించారు. డాక్టర్ అభిజిత్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యూరియా వాడకాన్ని తగ్గించేందుకు, యూరియా సామార్థ్యాన్ని సహజ సెల్యులోజ్, ఈస్ట్‌లను ఉపయోగించి 10 రెట్లు పెంచినట్టు ఈ పరిశోధన ద్వారా నిరూపితమైందన్నారు. దీంతో రైతులపై ఆర్థిక బారాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణ హితంగా యూరియాను వాడవచ్చన్నారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్పులు పంచాలి

హత్నూర, ఏప్రిల్ 24: ప్రభుత్వం జారీ చేసిన ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ పంచాలని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 42 వేల పైచిలుకు ఓటర్లు ఉన్నారని, వీరికోసం 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరు చోట్ల 19 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలవద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధేశ్వర శిఖరోత్సవం

రథంపై శిఖరాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కంగ్టి, ఏప్రిల్ 24: మండల కేంద్రమైన కంగ్టిలో ఐదురోజుల పాటు జరుగనున్న సిద్ధేశ్వరాలయ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతరలో మొదటి ఘట్టమైన శిఖరోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. సిద్ధేశ్వరాలయం వద్ద శిఖరాన్ని అందంగా పువ్వులు, లైటింగ్‌తో అలంకరించారు. అనంతరం శిఖరానికి ప్రత్యేకపూజలు చేసి గ్రామంలో హరోం హర... అంటూ ఊరేగింపు నిర్వహించారు. చౌరస్తాలో కట్టెలతో ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై శిఖరాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దారం వెంకటేశం, మాజీ సర్పంచ్‌లు విఠల్‌రెడ్డి, పట్నేనాగ్‌నాథ్, ఆలయ మాజీ కమిటీ చైర్మన్ కంతి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

శంశోల్లాపూర్‌లో ఘనంగా పల్లకీ సేవ

న్యాల్‌కల్, ఏప్రిల్ 24: మండలంలోని శంశోల్లాపూర్ గ్రామంలో ఆంజనేయస్వామి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో వారం రోజులుగా చేపట్టిన సప్తాహ భజన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా భజనకీర్తనల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ సల్మాన్‌రెడ్డి

సెయింట్ ఆంథోనిస్ విద్యార్థుల జయకేతనం

ఇంటర్ ఫలితాల్లో సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనిస్ విజయకేతనం ఎగురవేసింది. కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ సల్మాన్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

కోహీర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

కోహీర్, ఏప్రిల్ 24: బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. కోహీర్ పట్టణంలో బుధవారం ఆయా గ్రామాల బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అందించిన పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, మాజీ ఎంపీటీసీలు జగన్నాథ్‌రెడ్డి, రాజుస్వామి, గోవర్ధన్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 24: బీజేపీ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ బీబీ పాటిల్‌ను భారీ మోజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డ